# దుష్టగ్రహం

ఒకప్పుడు రాధను నాకిస్తామన్నారు. నేనే ఒప్పుకోలేదు. నాకు రాధంటే ఇష్టమూలేదు, అసహ్యమూ లేదు. రాధను నేను పెళ్లాడితే నేను తరిస్తాననిగాని, రాధ తరిస్తుందనిగాని నాకు నమ్మకం చిక్కలేదు. నేనసలు ఒకరిని సుఖపెట్టగలవాణ్ణి కాను. సుఖపడటానికి కొంత అమాయకత్వం కావాలి. మనుషులు పొందే సుఖానుభూతి అంతా అది మానవుల అనుభవంనుంచే వస్తుందని ఫ్రాయిడ్[1] అన్నాట్ట. అదే అయితే నాలో శిలాయుగం దాదాపు లేదనే చెప్పొచ్చు. అయితే నన్నెరిగిన వాళ్ళు మాత్రం నాలో ఆధునిక నాగరికత లేదంటారు. నిజం ఏమిటో మరి!

ఏమిటో చెబుతున్నాను.... అవును, రాధను చేసుకోమని నలుగురూ నాతో అన్నప్పుడు చేసుకోనన్నాను. ఎందుకన్నానో వాళ్ళకి చెప్పలేదు. మనుషులు అన్నిటికీ ప్రశ్నలు వేస్తారు.... ఎందుకు చేసుకోవూ? రాధ అందం నచ్చలేదా? దాని స్కూలుఫైనలు చదువు నీకు నచ్చలేదా? కట్నం బాగా కావాలా?"

ఒక తెభ్యంగాడు, రాధంటే నీకు ప్రేమ లేదా అని కూడా అడిగాడు.

నాకు ప్రశ్నలు వేసేవాళ్ళంటే మంట. తమకు తెలీని విషయాలు తెలిసినట్టు నటించేవాళ్ళంటే మరీమంట.

---

1. ఫ్రాయిడ్, సిగ్మండ్ (1856-1939) : ఆస్ట్రియా దేశస్థుడు. వైద్యుడు, నరాల రోగ నిపుణుడు (**Neuro-Pathologist**), మనస్తత్వ శాస్త్రవేత్త, మనోవైజ్ఞానికశాస్త్ర సంస్థాపకుడు. మానసిక స్థితిగతులు, మనుషుల చర్యలు, ఘటనలు వ్యక్తి అచేతన యొక్క బాహ్య వ్యక్తీకరణలు అని, అందులోనూ, స్త్రీ-పురుష సంబంధమైన వ్యక్తీకరణలని సిద్ధాంతీకరించినవాడు. అచేతనలో అణచుకున్న కోరికలకు - ప్రధానంగా స్త్రీ పురుష సంబంధమైన కోరికలకు కలలు ప్రతి రూపాలని భావించాడు. మానవ చరిత్ర, నీతి, కళ, శాస్త్రం, మతం, రాజ్యం, న్యాయం, యుద్ధం మొదలైన వాటికి కారణం యీ అచేతనే అని ఫ్రాయిడ్ అభిప్రాయం. ఈ శతాబ్ది కళాసృజనపై ఫ్రాయిడ్ భావాలు చూపిన ప్రభావం గణనీయం. నవ్య ఫ్రాయిడ్ వాదులైన హార్నీ, కార్డినర్, అలెగ్జాండర్, ఎరిక్ ఫ్రాం, ఫ్రాయిడ్ స్త్రీ పురుష ప్రేరణ సిద్ధాంతంతో భేదించారు. వీరు సాంస్కృతిక మనస్తత్వ వేత్తలు. మార్క్సిజానికి ఫ్రాయిడ నిజానికీ సమన్వయం చేసేందుకు ప్రయత్నించినవాళ్ళు. సామాజిక శాస్త్రాలలో ఫ్రాయిడ్ సిద్ధాంతం అత్మాశ్రయ ధోరణికి సంబంధించినది. రచనలు : **Totem and Taboo (1918); Ego and Id (1927); Civilization and its Discontent (1930); Three Contributions of the Theory of Sex (1910); Interpretation of Sex (1919).**

రాధను నేను పెళ్లాడనన్నది నాకు పెళ్ళిలో నమ్మకంలేక. నేను పుట్టి పెరిగిన పాతికేళ్ళలో ఒక్క మెచ్చుకోదగిన దాంపత్యం కూడా చూడలేదు. ఒక ఆడదీ, ఒక మగాడూ కలిసి యావజ్జీవం సుఖంగా దాంపత్యం ఏడుస్తారనుకోవటం కన్న ఫూలిష్ సూపర్‌స్టిషన్ నే నెక్కడా చూడలేదు. ఇద్దరు మనుష్యుల చేతులు కలిసి సంకెళ్ళు వేసినట్టే. ఫలిత మేమిటి? ఆడవాళ్ళు తమ భర్తలకన్న ఎంత హీనుడైనా పరాయివాడే నయమనుకోవటం, వాడిలో లేని మంచి చూడటం, ధైర్యం ఉంటే వాడికోసం తహతహ లాడటం, చాతనైతే వాడితో రంకు సాగించటం.

పెళ్ళి గురించి నా విశ్వాసం ఒక్క ముక్కలో చెబుతాను. ప్రపంచంలోకల్లా ఎక్కువ ద్వేషమూ, అసహ్యమూ ఉన్న దాన్ని పెళ్లాడు. ఆ పని చెయ్యలేవు. నాకు తెలుసు. అంచేత పెళ్ళీ పెటాకులూ అనక గమ్మునుండు.

నా ఖర్మకాలి, నేను జీవితంలో కుళ్ళే చూశాను. అందులో సుగంధాలు ఆఘ్రాణించినట్టు కనపడేవాళ్ళను చూస్తే నాకు తగని మంట.

చాలామందికి – దాదాపు అందరికీని – తాము మనుషులను మహా అర్థం చేసుకోగలమని కత్తిలేని నమ్మకం. అటువంటి వాళ్ళే తమ తల్లులనూ, తోబుట్టువులనూ కూడా అర్థంచేసుకోలేకపోవటం నే నెరుగుదును. ఏదన్నా తెచ్చి ఇచ్చినప్పుడు, అన్నయ్యంటే అన్నయ్యనే చెప్పుకోవాలి. మర్నాడు ఏదో చిన్న కోరిక నిరాకరించగానే "నువు ఊళ్లోవాళ్ల కందరికీ చేస్తావుగాని, నా కెందుకు చేస్తావూ? నీ సంగతి నాకు తెలీదూ?"

నా చెల్లెలే ఆ మాట అన్నప్పుడు "తెలీదు" అని తడువుకోకుండా అనేశాను.

మనుషులు స్వార్థంలో బతుకుతున్నారు. బతకరాదని చెప్పి ఫూలువు కాకు. వాళ్లు స్వార్థంలోనే బతుకుతారు. నీది అరణ్యారోదనం. అరణ్యారోదనం పుస్తకాల నిండా ఉంది. చదివి చదివి తల పట్టిపోయింది.

ప్రేమ! న్యాయం! ధర్మం! డెమోక్రసీ! పచ్చి అబద్దాలు. నా మిత్రుడొకడు నందా రాజకీయాల గురించి గుండె బాదుకుంటూ, రోజూ వందమందితో చెప్పుకుని, "ఇంత పచ్చికలి ఎక్కడైనా ఉందా?" అంటాడు. వట్టి ఫూల్! ఉందిగా? కళ్ళ ఎదట కనిపిస్తున్నదిగా!

వాడికి అన్నో తమ్ముడో ఇంకోడున్నాడు. వాడికి అమెరికా అంతర్జాతీయ రాజకీయాలు మాట్లాడినప్పుడల్లా కడుపు చెరువవుతుంది. "అమెరికా ఇలా నిరంకుశంగా ప్రవర్తిస్తుంటే ప్రపంచం ఎందుకు సహిస్తున్నదని!" అంటాడు.

ప్రపంచం సహించకపోతే అమెరికా ఆ విధానాన్ని మార్చుకునే ఉండేదిగా?

మంత్రులున్నారు, కంట్రాక్టర్లున్నారు, దొంగ వ్యాపారస్థులున్నారు, దొర వ్యాపారస్థులున్నారు, భూస్వాములున్నారు, కటిక దరిద్రులున్నారు. ధనికులు కాల్చి పారేసే సిగరెట్టు ఖర్చు తిండికోసం వెచ్చించ లేనంత కటిక పేదవాళ్ళున్నారు.

హైక్లాసు హోటలువాడు ఒక మనిషి తినే టిఫినుమీద తీసే లాభమంత రోజు కూలి సంపాదించలేని శ్రామికులున్నారు. ఇది చూసి లబోమని ఏడిచేవాళ్ళున్నారు. వాళ్ళను ఏడవనీండి. నే నేడవను.

ఇదంతా ఇలా ఉండగూడదు అని ఎవడన్నా అన్నప్పుడు మాత్రం నాకు తన్న బుద్ధి అవుతుంది. ఈ పరిస్థితులకు నేను కారణంకాను. వాడు ఆర్చేవాడూ, తీర్చేవాడూ కాడు. ఇక నెందుకూ?

ఓ సారి మా పక్కింటాయన, నన్ను షూటింగు చూపిస్తానని తీసుకెళ్ళాడు. చూపించాడు. వాళ్ళేదో షాటు తీస్తున్నారు. ఆయన నాతో రహస్యంగా "ఆ నటి అలా చెయ్యకుండా ఇలా చేస్తే చాలా బాగుంటుంది కాదూ?" అన్నాడు.

"చెయ్యదు" అన్నాను.

"డైరెక్టరు చెబితే చేస్తుంది" అన్నాడు.

"చెప్పడు" అన్నాను.

అప్పటికి సత్యం బోధపడి సంగతి అంతటితో పోనిచ్చాడు.

ఏమిటో చెబుతున్నాను........అవును, నేను రాధను పెళ్ళాడ నన్నాను. రాధే ఏమిటి? హాలీవుడ్ సినిమా తారను పెళ్లాడమన్నా ఆ మాటే అని ఉండేవాణ్ణి.

"వాడెందుకు పెళ్లాడతాడురా? ఏ పదివేల కట్నానికో ఎరవేసి కూర్చున్నాడు" అన్నాడు మా మేనమామ.

నన్ను గురించి ఎవరికీ ఎక్కువ తెలీదు. నాక్కూడా ఎవరిని గురించీ ఎక్కువగా తెలీదు. అసలు ఎవరికీ, ఎవరిని గురించీ ఏమీ తెలీదనే చెప్పొచ్చు. కథలూ, నాటకాలూ రాసే వాళ్ళకి వాళ్ళ పాత్రలను గురించి తప్ప. నన్నడిగితే అదీ అనుమానాస్పదమే.

కాని నన్ను గురించి మా మేనమామకు తెలిసినంత తక్కువగా ఎవరికీ ఎవరిని గురించీ తెలీదు. అంటే నా ఉద్దేశం మా మేనమామకు నన్నుగురించి ఏమీ తెలీదని. నేను పదివేల కట్నానికి ఎరవేసి కూర్చున్నా నన్నది ఆయన తన జ్ఞానాన్ని బయట పెట్టుకున్నందుకు అన్నమాట కాదు-అలా అంటే అందరూ తన తెలివికి సంతోషిస్తారని; మానవ మనస్తత్వం గురించి తన కెంత బాగా తెలుసు అని మెచ్చుకుంటారు గదా అని.

నిజానికి నాకు డబ్బంటే పరమడోకు. డబ్బు కోసం మనుషులు కుక్కలూ పందులూ - ఇంకా హీనం కూడా కావటం నేను చూశాను. తాము హీనం అయిపోనట్టు నటించటంచూసి మరింత వాంతి చేసుకున్నాను. వెనక భట్రాజులది ఒక వృత్తిగా ఉండేది. అది ఈనాడు అందరికీ హాబీ అయింది. బాగా డబ్బున్నవాడు పరమ చెత్త వాగుతూంటే, బిస్మిల్లా సన్నాయి ఆలకించే మొహాలు పెట్టిన వాళ్ళని కళ్ళారా చూశాను.

నాకు ప్రపంచమంటే రోత ఉన్నందుకు ఎవరూ ఆశ్చర్య పడవద్దు. అందరి వారా నేనే. ప్రపంచాన్ని కావలించుకునే వాళ్ళనుచూసి మనస్ఫూర్తిగా రోస్తున్నాను.

చిన్నప్పుడు మా పెదనాన్న నాకు భగవద్గీతలో శ్లోకాలు చదివి చెప్పేవాడు. ఎంతమందిలోనో ఒక్కడు ఏదో చేస్తాట్ట. అలా చేసే వాళ్లెంతమందిలోనో ఒక్కడు ఇంకేదో చేస్తాట్ట. ఇలా తగ్గించుకుంటూ పోగా పోగా, ఏనాడో, ఒక్కడంటే ఒక్కడు; జన్మరాహిత్యం పొందుతాట్ట. నన్నడిగితే ప్రతి బుద్ధిగల మనిషీ జన్మరాహిత్యం కోరాలి. నా కిటువంటి ప్రపంచంలో జన్మవద్దు.

నేను ప్రేమవివాహం తప్ప చేసుకోనని ఒక యంత్రబ్రహ్మ గెస్ చేశాడు. ఒకప్పుడు నాకు ప్రేమ అంటే వెంట్రుకవాసి నమ్మకం ఉండేది. ప్రేమ సినిమాలూ, ప్రేమ కథలూ చూశాక అందులో పదిహేను వీసాలు ఎగిరి పోయింది. ప్రేమ వివాహాలు చేసుకున్న రెండు జంటల్ని పెళ్ళయిన కొంత కాలానికి చూశాక పూర్తిగా పోయింది.

కామం సత్యం, ప్రేమ మిథ్య. అదే నా సూత్రం. ఎవతెనో ప్రేమించ గలుగుతాననీ, దాన్ని పెళ్ళాడతాననీ నేను కలలో కూడా అనుకోవటంలేదు. ఒకవేళ నా ప్రయత్నం లేకుండా ప్రేమ అనేది నామీద వచ్చిపడితే నేను పతనమైనట్టే. అనేకమంది పతనమయారు. నేను మాత్రం ఎందుకు కాకూడదూ? నా కేమన్నా కొమ్ములు మొలిచాయా?

రాధ నన్ను కామించి వచ్చి ఉంటే వద్దని ఉండను. కాని రాధను పెళ్ళి చేసుకోమంటే—

అతి హేయమైన, మహా నీచమైన ఈ ప్రపంచంలో దివ్యత్వంతో కూడినది ఒకటే ఉంది - సంగీతం. అది కల్ల బొల్లి న్యాయాలకూ, ధర్మాలకూ, నీతులకూ, ప్రేమలకూ, బోధలకూ అతీతమైనది. సంగీతం వింటావు. లోలోపల నీరై పోతావు. కాకుండా నిన్ను ఆపగల శక్తి ప్రపంచంలో ఏదీలేదు. దానికి సాంఘిక మర్యాదలు తెలీవు. నీ అనుమతి లేకుండానే నిన్ను నీరు చేసేస్తుంది.

అందుకే సినిమాలలో ప్రేమికులు తమ మైథునవాంఛ పవిత్రంగా ఉన్నట్టు సెన్సారుకూ, ప్రేక్షకులకూ భ్రమ కలిగించటానికి యుగళ గీతాలు పాడతారు.

కాని సంగీతానికి చలించనివాళ్ళు ఉంటారుట. వాళ్ళు స్థితప్రజ్ఞులు. జీవన్ముక్తులు. వాళ్ళది జన్మేకాదు. అంచేత వాళ్ళ విషయంలో జన్మ రాహిత్య ప్రశంస లేదు.

రాధ కొంచెం బాగానే పాడుతుంది. అందుకని రాధను పెళ్ళాడటం బుద్ధి తక్కువ. పెళ్ళాడకుండానే లతా పాడుతుంది. ఆశా[1] పాడుతుంది. సుశీలా[2] పాడుతుంది. ఇంకా పాడటానికీ పాట వినిపించటానికీ పుట్టిన ఖాన్ సాహేబులూ[3], రవిశంకర్లూ[4], కన్నాలాల్లూ ఎందరో ఉన్నారు. రేడియో యుగంలో పాటకోసం ఎవరూ రాధలను పెళ్లాడ నవసరంలేదు.

*   *   *

మనుషులకు ఉద్యమాలిష్టం. అందుకే ఇన్ని అర్థంలేని సమాజాలు. సాహిత్యం, సినిమాపిచ్చి, అరటి పళ్ళంటే అసహ్యం, లెవెల్ క్రాసింగుల దగ్గరా, స్టూడియోల గేట్ల కెదురుగానూ నిలబడి వచ్చేపొయ్యే సినిమా కారులను చూడటం, తిరుపతి వెళ్ళి గుండు చేయించుకోవటం-ఇటువంటివి ఎన్నో ఉద్యమాలు.

ఎలాగైనా రాధను నా కంటగట్టాలన్నది చిన్న ఉద్యమంగా పరిణమించింది. అందులో నా దగ్గిర బంధువులూ, దూరపు బంధువులూ, బంధువులు కాని వాళ్ళూ, కొద్దిగా నేనంటే అసహ్యం వున్నవాళ్ళు కూడా, ఆనాడు గాంధీగారి పిలుపు విని, జాతీయోద్యమంలోకి దిగబడ్డట్లుగా దిగబడ్డారు. వీరాభిమన్యుడిలాగా ఒంటరిగా ఆ ఉద్యమాన్ని నీరు గార్చేశాను.

దింపుడు కళ్ళెంకింద మా అమ్మను ఉద్యమంలోకి దింపారు.

"ఆ రాధనుట. పెళ్ళిట. చేసుకోరాదుట్రా?" అన్నది అమ్మ. ఆ టకారాలు లేకపోతే నేను బొత్తిగా మొరాయిస్తానని ఆవిడ గెస్. నన్ను గురించి అందరూ గెస్ చేసేవాళ్ళే.

"చేసుకోనులేమ్మా" అన్నాను.

---

1. ఆశా భోన్స్లే : లతా మంగేష్కర్ సోదరి, ప్రసిద్ధ గాయని.

2. పి. సుశీల : ఉత్తమ నేపథ్యగాయని. కన్నతల్లి చిత్రంలో తొలిసారిగా పాడింది. అన్ని దక్షిణ భారత భాషల్లోనూ కొన్నివేల పాటలు పాడింది. హిందీ చిత్రం బచ్‌పన్‌లో కూడా పాడింది.

3. ఖాన్‌సాహెబ్‌లు : ఎ) ఉస్తాద్ బడేగులాం అలీఖాన్ (1902-1968) సంగీత సామ్రాట్‌వంటి బిరుదులు పొందిన గాయకుడు. కొ. కు. కు చాలా యిష్టమైన గాయకుల్లో ఒకరు. కొ. కు. ఫొటోల ఆల్బంలో బడే గులాం అలీఖాన్ గానసభకు హాజరయిన సందర్భంలో తీసిన ఫొటో కూడా ఒకటి వుంది.

బి) ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ : సుప్రసిద్ధ షెహనాయీ విద్వాంసుడు.

4. రవి శంకర్ : (1920-) ప్రపంచ ప్రసిద్ధుడైన సంగీతవేత్త. నృత్యం కూడా అభ్యసించారు. పథేర్ పాంచాలి, ది ఫ్లూట్ అండ్ ది బౌ, ఇమ్మోర్టల్ చిత్రాలకు సంగీతాన్ని సమకూర్చారు. బెర్లిన్‌లో 'వెండి ఎలుగు'ను పొందారు. ఆయన రాసిన గ్రంథం : మ్యూజిక్ మెమొరీ.

"ఏం?" అన్నదావిడ, కనపడీ కనపడని ఆశ్చర్యం ప్రకటిస్తూ.

"నా కసలు పెళ్ళేమిటి? వద్దు."

"అయితే నేను మనవలనీ, మనవరాళ్ళనీ చూసే గీత లేదా ఏం?"

"చిట్టితల్లి పిల్లలను చూస్తూనే ఉంటివిగా? విసుగెత్తలా?"

అమ్మ కొంచెంగా వొణికి "అబ్బ! వాళ్ళ మాట చెప్పమాక. రాలుగాయలు" అన్నది.

"చిన్నప్పుడు నేనూ అంతే ఉయివుంటాను. నన్ను పెంచి పెద్దచేసినందుకు నీకు మహావీరచక్ర ఇవ్వొచ్చు."

"వెధవా, నువ్విప్పటికీ రాలుగాయవే" అన్నది అమ్మ.

"నువ్వు నన్ను కనకుండా ఉంటే ఇన్ని చిక్కులుండేవి కావు. జీవితం చక్రవడ్డీ అనుకో!" అన్నాను.

" సరే, నీ యిష్టం. చెప్పవలసింది చెప్పా. నామాటెప్పుడు విన్నావు గనకా?" అని అమ్మ యుద్ధరంగం నుంచి చాలా త్వరగా విరమిస్తూ గెలిచినంత పోజు పెట్టింది.

అంతటితో ఆ ఉద్యమం గాంధీ మహాత్ముడి సత్యాహింసల్లాగా ప్రోపిలోకి రాకుండా పోయింది.

అందరికన్నా ఆలస్యంగా నడుం బిగించినా ఆ ఉద్యమానికి నాయకులుగా పని చేసిన మిగతా వాళ్ళకన్న అమ్మే మంచిది. అమ్మకు కొంతయినా రాధమీద ఇష్టం ఉంది. అది తనకు కోడలైతే బాగుండునని వుంది. మిగిలిన వాళ్ళ కది కూడా లేదు. అందులో కొందరు కేవలమూ నన్ను ఓడించటమే పనిగా పెట్టుకుని, రోడ్డుమీద ఆడాయించిన కారును దారే పొయ్యేవాళ్ళు ఆగి తోసే మన సత్వంతో, 'వాడు దీన్ని ఎందుకు చేసుకోడో చూస్తాం' అనుకుని మరీ రంగంలోకి దిగారు.

నా చేతిలో చిత్తుగా ఓడిపోతూ ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా పగ తీర్చుకున్నారు....దానికి నీకన్న మంచిమొగుడే రాసిపెట్టి ఉన్నాడేమో....! నువు చేసుకోనన్నంత మాత్రాన దాని పెళ్ళేమీ ఆగదులే. నీ సంగతి తెలిస్తే వాళ్ల దాన్ని నీ కిస్తామనే అనరు-నేనే అనను!....

చచ్చు మాటలు. దానికి నాకన్న మంచి మొగుడు వస్తే నాకన్న సంతోషించే వాళ్ళుండరు. నేను దానికి మంచి మొగుణ్ణవుతానని నవ్వులకుకూడా నే నెవరితోనూ అనలేదు. దాన్ని చేసుకోమని అనమన్న ముసలాయన నన్ను వారంరోజులు చంపుకు తిన్నాడు—దాన్ని చేసుకోమని! పెద్ద జిడ్డు!

అయితే వాళ్ళందరి శాపనార్థాలూ ఫలించి రాధకు త్వరలోనే మంచి సంబంధం కుదిరింది.

“నువ్వు చేసుకోకపోతే ఆగుతుందేమిటి? ఫస్ట్లాస్ సంబంధం వచ్చింది రాధకి!” అన్నాడొక త్రాష్టుడు.

వాడి మన స్తత్వం ఆలోచించుకుంటే నాకు ఒళ్ళంతా తేళ్ళూ మండ్రగబ్బలూ పాకినట్టయింది. నేను చేసుకోనంటే రాధకి ఇక సంబంధమే రాదనే నమ్మకంతో నేను చేసుకోనన్నానని వాడి నమ్మకమన్నమాట! అంతకంటె హీనమైన ఆలోచన ఎలా వుంటుందో నా కీనాటికీ అర్థంకాలేదు. నేను అధముణ్ణి కావచ్చుగాని ఆ నీచుడనుకున్నంత అధముణ్ణి కావటం సాధ్యంకాదు. వాణ్ణి తప్పుపట్టి లాభంలేదు. అటువంటి మాటలు అనేకమంది అర్థం తెలియకుండానే మాటవరసగా అనేస్తారు. మనిషికి బుర్ర చాలా తక్కువ. మనం మనమనుకున్నంత తెలివిగల వాళ్ళం కాం. మనని మెచ్చుకునే వాళ్ళనుకున్నంత తెలివిగల వాళ్ళం అసలే కాం.

రాధకి సంబంధం కుదరటానికీ, పెళ్ళిముహూర్తానికీ సందున ఒక చిన్న సంఘటన జరిగింది. దాంతో పైన చెప్పిన త్రాష్టుడిమీద నాకు పట్టరాని ఆగ్రహం వచ్చింది.

రాధకు సంబంధం కుదిరిన ఓ వారంరోజుల కనుకుంటాను. నేను గుడివాడ వెళ్ళాను. తీరా ఆ వూళ్ళో అడుగు పెట్టాక నాకు జ్ఞాపకం వచ్చింది—రాధను ఆ వూరే ఇస్తున్నారు. జ్ఞాపకం వచ్చినా చేసేదేమీ లేదు. అంత వూళ్ళో వాళ్ళ యిల్లెక్కడో, వాళ్ళెవరో నాకు తెలీదు. నేనొక స్నేహితుడింటి కెళ్ళాను.

ఆ స్నేహితు డొక ఇంట్లో ఒక భాగంలో అద్దెకుంటున్నాడు. వాడు నాకు ఇంటి వాళ్ళను గురించి సరదాగా చాలా సంగతులు చెప్పాడు. వాడు చెప్పిన దాన్నిబట్టి ఇంటివాళ్ళు వింత మనుషులుగా కనబడ్డారు. ఇంటాయనకు నలుగురు కొడుకులూ, ఒక కూతురూనూ. ఇద్దరు కొడుకులకు పెళ్ళి అయింది. పెద్ద వాడి భార్య గణాచారి. నవ్వుల కనటం కాదు. నిజంగానే ఆవిడకు రోజు విడిచి రోజు—బుధవారాలు తప్ప—పూనుతుందిట. చచ్చిపోయిన వాళ్ళూ, దేవతలూ, వెంకటేశ్వర స్వామీ, చచ్చిపోయిన ఆమె తల్లీ వచ్చి ఆవిడమీద ఆవహించి, చూడ వచ్చిన వాళ్ళ మనసులో ఉండే మాటలు చెప్పి, సలహాలూ అవీ ఇస్తూ ఉంటారుట. ఒక్కొక్కప్పుడు ఆవిడ చెప్పేవి నిజం కూడా అవుతాయిట. ఆవిడ చెప్పే మాటలు నిజమవుతాయని నమ్మేవాళ్ళు ఆ చుట్టుపక్కల వందల సంఖ్యలో ఉన్నారుట.

అసలే అయోమయమైన జీవితంలో నా ప్రాణాని కిది సరికొత్త అయోమయం. అందుచేత నేను, నా స్నేహితుడు వద్దంటున్నా వినకుండా, ఇంటాయన పరిచయం చేసుకున్నాను. ఆయన ఇంత పెద్ద కుంకంబొట్టు పెట్టుకుని ముందు వసారాలో చెక్కబల్ల మీద కూర్చొని నాకు దర్శన మిచ్చాడు. ఆ రోజు బుధవారం. అందుచేత దయ్యాలూ, దేవతలూ వగైరాలకు ఆటవిడుపు.

ఆయన నా దగ్గిర తమ యింటిగుట్టు లేవీ దాచలేదు.

"నా పెద్దకోడలు క్రితం జన్మలో ఒక మునీశ్వరుడి భార్య. కించిత్తు పాపం తీర్చుకునేందుకు ఈ జన్మలో ఇలా పుట్టింది. ఈ అవతారం చాలించాక తిన్నగా పార్వతీదేవి వద్దకు వెళ్ళిపోతుంది. అసలు దాని పేరే దుర్గ. దాని పుణ్యమా అంటూ ఐహిక బంధాల నుంచీ, భయాలనుంచీ విముక్తి పొందాం. మా అల్లుడు మూడు నెలలకు పోతాడనగా మా కోడలు ఘడియతో సహా చెప్పేసింది. మొగుడు పోయినప్పుడు నా కూతురు కంటతడి పెట్టలేదు. ఎందుకూ? అతను అసమానం దాని దగ్గిరే ఉంటున్నాడు. మా రెండోకోడలు వచ్చేవైశాఖంలో మంచానపడి శ్రావణంలో పోతుంది. అయితేనేం? మా కే విచారమూ లేదు. అలా రాసిపెట్టి ఉంది. దుర్గ ముందుగానే చెప్పేసింది. మన బాధలు సగం భయంవల్లనేనూ. అన్నీ తెలిసిన మీదట మరి భయం దేనికీ? తాడేనూ అని తెలిసిపోతూంటే పాముని ఎవరు భయపడతారూ? మా దుర్గ మా పాలిటి అఖండ జ్యోతి. మేం దారి వెతుక్కో నవసరం లేదు. ఈ మధ్యాని అది మా మూడోవాడికి దక్షిణంనుంచి సంబంధం రాబోతున్నదని చెప్పేసింది. అలాగే వచ్చింది. ఇంకెందుకూ ఆలోచనా? సరే ననేశాను. వచ్చే నెలలో ముహూర్తం కూడా అనుకున్నాం" అన్నాడు ఇంటి పెద్ద.

ఈ రకంగా జీవిస్తున్నవాళ్ళు ఈ పుణ్యభూమిలో చాలామంది ఉండొచ్చు. కాని నేను ఇటువంటివాళ్ళను చూడటం ఇదే మొదలు. మొదట ఆయన మాటలు వింటున్నప్పుడు నా కా జీవితంలో ఏదో ఆకర్షణ కనబడింది కాని తరవాత ఆలోచిస్తే ఎందుకో అసహ్యం వేసింది. ఆ జీవితంలో వ్యక్తిత్వంలేదు. చచ్చినవాళ్ళకూ, బతికిన వాళ్ళకూ తేడా లేదు. వాళ్ళు తాళ్ళనుచూసి పాము లనుకోరేమోగాని పాములను చూసికూడా తాళ్ళకింద కట్టేసేటట్టు కనబడ్డారు. అదేం జీవితం?

"చాలా బాగుందండి! అయితే వచ్చేనెల్లో మీయింట బాజాలు మోగుతాయన్నమాట!" అన్నాను.

బాజాలు మోగట మనేమాట ఆయనకు నచ్చినట్టు లేదు. ఆయన అదో రకంగా మొహంపెట్టి, "అదంతా విధిలిఖితం ప్రకారం జరిగిపోతుంది. మనకర్తృత్వం ఏమీలేదు. వచ్చేనెల పెళ్ళి జరిగిపోతుంది. మనమింకా ఒక నెల వెనక ఉన్నాం. అంతే! మా దుర్గకు ఒక్కత్తెకే భవిష్యత్తులోకి వెళ్ళగల శక్తి ఉన్నది. మావాడి పేరు కృష్ణమూర్తి. వాడి పేరుకు అతికే పేరుగల భార్య వస్తుందని కూడా అది చెప్పేసింది." అన్నా డాయన.

నా బుర్రలో చిన్న దీపం మిణుకు మన్నది.

"పిల్ల దేవూరు?" అన్నాను.

మిణుకు మనే దీపం కాస్తా మతాబాలాగా వెలిగింది. రాధను కుదిరిన సంబంధం ఆ కృష్ణమూర్తే!

* * *

తప్పించుకు తిరుగువాడు ధన్యుడన్నా డొక సుమతి. నేను ధన్యుణ్ణే. నేను లోకంలో కుళ్ళు అన్వేషించేది కేవలమూ తప్పించుకు తిరిగే సదుద్దేశంతోనే. నా అంచనాప్రకారం నేను ఒక రకమైన స్థితప్రజ్ఞుణ్ణి. చాతావాతాగాని మరమ్మతులకు పోను. పెద్దవాళ్ళు చిన్నవాళ్ళను చావగొడుతుంటే చలించకుండా ఉండగలను. దేశంనిండా రాజకీయద్రోహాలూ, సంఘంనిండా అమానుష చర్యలూ జరుగుతూంటే వాటిని పట్టించుకోలేదు. ఇంతబలం ఉన్నాకూడా నాలో ఒక చిన్న మనోదౌర్బల్యం ఉన్నది. నేను ద్వేషించేదాన్ని మార్చగలనని తోచినప్పుడు మటుకు చూస్తూ ఊరుకోలేను. ఎవడన్నా తన భార్యను చావగొడుతుంటే అడ్డంవెళ్ళి వాణ్ణి తన్నానో, ఆ తరవాత ఆ ఆడదాన్ని వాడితో కాపరంచేసి మరింత హింసలపాలు కానివ్వను, నేనే తెచ్చి సాకుతాను. నా వివాహసమస్య ఏనాడో ఈ విధంగా పరిష్కార మవుతుందన్న భయం నాలో లేకపోలేదు. అదే నాకున్న ఒక్క దౌర్బల్యమూనూ.

రాధను పెళ్ళాడ నిరాకరించిన నేను దానికి ద్రోహం చేశానని అంతరాంతరాలలోకూడా అనుకోలేదు గాని, ఆ బతికున్న దయ్యాల కొంపలోకి దాన్ని పోనివ్వటం ద్రోహమేమో ననిపించింది.

దీన్ని ఫస్ట్‌లాస్ సంబంధం అన్న ఆ భ్రష్టుడిమీద చచ్చేకోపం వచ్చింది.

ఈ పెళ్ళి తప్పించాలి. అతి సులువుగా, రెండో కంటివాడికి తెలీకుండా తప్పించొచ్చు. గౌరమ్మమావగారికి ఆకాశరామన్న ఉత్తరం ఒకటి రాసి విజయవాడ స్టేషనులో పోస్టు చేశాను. టంకం పొడిలాగా ఒక్కటే ముక్క : "మీరు మీ అబ్బాయికి చేసుకుందా మనుకుంటున్న ఫలాని అమ్మాయి ప్రవర్తన చాలా చెడ్డది."

టంకం అతికింది. మీ సంబంధం మా కక్కర్లేదని గుడివాడ నుంచి రాధ తండ్రికి ఉత్తరం వచ్చింది.

దయ్యాలతో సహజీవనం చేస్తున్నారేగాని వాళ్ళు మామూలు మనుషులే; దుశ్శీలను కోడలుగా చేసుకోవడాని హడలిపోయారు. దుర్గమ్మ చెప్పిన జోస్యం తప్పయినందుకు మథనపడ్డారా ? ఏమో ? వాళ్ళేమైతే నాకేం ? రాధను ఘోరమైన జీవితంనుంచి తప్పించి, నాకు చాతనైన సహాయం చేశాను. ఈ ఆలోచనతో నా వీపు నేనే చాలాసార్లు తట్టుకుని లోలోపల పొంగిపోయాను.

ఒక్క విషయంలోనే నేను పప్పులో కాలువేశాను.

"వీడే సంబంధం పడగొట్టి ఉంటాడు" అని ఒక దుష్టుడు సరిగా గెస్ చేశాడు.

"వీ డీ మధ్య గుడివాడ కూడా వెళ్ళొచ్చాడు. ఇందుకే అయి ఉంటుంది" అన్నాడు మరో శఠుడు.

నా చుట్టూ ఉచ్చు బిగుస్తున్నది. నేను వెళ్ళింది ఏకంగా పెళ్ళివారి ఇంటికేనని బయటపడటం మాత్రమే తరవాయి.

"ఏంరా, వాళ్ళ రాధని నువు చేసుకోకపోగా దానికి వచ్చిన సంబంధాలు కూడా చెడగొట్టుతున్నావుటగా?" అన్నది అమ్మ, టకార ప్రయోగంతో తనమీద కర్తృత్వం లేకుండా చేసుకుని.

"నీ కేమన్నా పిచ్చాయేమ్మా? నేను చేసుకుందా మనుకున్న దాన్ని నా క్కాకుండా ఇంకోరికిస్తే సంబంధం చెడగొట్టానన్నా అర్థం ఉంటుందిగాని—"

"మరి వాళ్ళంతా అట్లా చెప్పుకుంటారేం?" అని, మనుషుల బుద్ధితక్కువ మీద అమ్మ విసుక్కుంది.

ఇంతలో 'కోడూరుపీడ క్రాపమీదుగా పోయిం'దన్నట్టుగా జనం నన్ను గురించి చెప్పుకోవటం మానేశారు. రాధ మేనత్త— పెళ్ళి ప్రయత్నాలకి తోడొచ్చింది. పాపం వీధిలోపోయే సోదిమనిషిని పిలిచి సోది చెప్పించింది. ఏదో దుష్టగ్రహం అడ్డు తగిలి కావలసిన పెళ్ళి చెడగొట్టినట్టు చెప్పింది.

ఆ దుష్టగ్రహాన్ని నేనే నన్నసంగతి నాకు తప్ప ఇంకెవరికీ తెలీదు. సోది చెప్పిందానికి మొదలే తెలీదు. నాకు పరమానంద మయింది.

ఒకరోజు రాధ మాయింటి కొచ్చినప్పుడు అమ్మ పరామర్శింపుగా, "ఇట్లా అయిందేవిటే? అవతలవాళ్ళు సంబంధం ఎందుకు మానుకున్నారుట?"అని అడిగింది.

"ఏదో దుష్టగ్రహం వాళ్ళ దగ్గిరికి వెళ్ళి ఈ సంబంధం చేసుకోవద్దని చెప్పిందిట" అన్నది రాధ, నాకేసి భావగర్భితమైన చూపొకటి విసిరి.

"అంతదాకా అవసరం లేదు. ఆ ఇంటి పెద్దకోడలుకు పూనకం వచ్చి ఏం చెయ్యమంటే అది చేస్తారు. ఆ సంగతి నీకు తెలుసా, నీకు అవుతుందన్న ఆడ బిడుచు పునిస్త్రీగా ఉండగానే దాని మొగుడు పోతాడని వాళ్ళకు తెలుసుట. వచ్చే శ్రావణమాసంలో వాళ్ళ రెండో కోడలు చస్తుందిట. వాళ్లా విషయమై నిశ్చింతగా ఉన్నారు. వాళ్లు మనుషులు చెప్పేది వినరు. దయ్యాలూ, దేవుళ్లూ చెప్పేదే వింటారు." అన్నాను.

రాధ కళ్లు పెద్దవిచేసి నాకేసి కాసేపు తేరిపార జూసింది.

"ఇంకా సంబంధా లేవైనా చూస్తున్నారుటే?" అన్నది అమ్మ.

"ఈసారి సంబంధం కుదిరితే మా అమ్మా, నాన్నా బ్రహ్మరుద్రులకూడా చెప్పరుట." అన్నది రాధ.

కాని, పాపం, రాధ ధైర్యం ఎందుకూ పనికి రాలేదు. రాధ చెడ్డదని ఆ గుడివాడ వాళ్లు చాలా దుష్ప్రచారం చేశారు వాళ్ళను తప్పుకట్టి ఏం లాభం? ఫలాని సంబంధం ఎందుకు వదులుకున్నారని పదిమందీ అడిగితే ఏదో ఒకటిచెప్పి ఆత్మ సమర్థన చేసుకోవాలి గదా! సమర్థన చేతగాని వాళ్ళకు ఆత్మ లుండీ, ఉండకా ఒకటే.

అయితే వాళ్ళు ఆకాశరామన్న పేరెత్తకుండా చచ్చిపోయిన తమఅల్లుడో, వెంకటే శ్వరస్వామో చెప్పాడన్నారు. దాంతో జనానికి రాధ దుశ్శీలంపైన మరింత బాగా గురి కుదిరి ఉంటుంది.

ఏమైనా రాధకు సంబంధాలు ఆట్టే రాలేదు. వచ్చిన ఒకరిద్దరూ ఆ గుడివాడ సంబంధం వెనక్కు పోవటానికి కారణమేమిటి అని గుచ్చి అడిగారు. మొత్తానికి వచ్చిన సంబంధాలు నిలవలేదు.

'కోతి పుండు బ్రహ్మరాక్షసి'గా పరిణమించింది. రాధను వాళ్ళ అమ్మా, నాన్నా దగ్గిర్నుంచీ కాకులల్లే పొడవసాగారు. తల్లి పచ్చగన్నేరు పప్పులు తినటానికి ప్రయత్నించినట్టు తెలిసింది.

మూఢ లోకం, కూతురికి పెళ్ళి కాకపోతే తల్లిదండ్రులు ఆత్మహత్యలు చేసుకుని మానం నిలబెట్టు కుంటారుట! పైసా విలువ చెయ్యని మానం. ఇటువంటి మనుషులు కథల్లోనూ, సినిమాల్లోనూ ఘరానా మనుషులు కావచ్చు. నా దృష్టిలో గాడిదలు — అడ్డ గాడిదలు.

నా దౌర్బల్యానికి నేను శిక్షపొందక తప్పదని తోచింది. నేను ఎంత హీనుణ్ణ యినా పిరికివాణ్ణి మటుకు కాను. రాధా వాళ్ళింటికి వెళ్ళి రాధ నాన్నను, "ఏం మావయ్యా!" అని పలకరించాను.

"ఇదెప్పటినుంచీ?" అన్నట్టు చూశాడు.

"అత్తయ్య కేదో సుస్తీ చేసిందట?" అన్నాను.

"ఎందుకు చెయ్యదూ?" అన్నాడాయన.

"అయితే రాధను నాకిచ్చి పెళ్ళి చెయ్యండి" అన్నాను.

"చెప్పవూ!" అన్నాడాయన.

రాధను పెళ్ళి చేసుకున్నాను. నన్నెవరూ ప్రోద్బలం చెయ్యలేదు. నా విశ్వాసాలలో నాకు విశ్వాసం ఉండి అలా చేశాను. (తమరలా చెయ్యి అడ్డం పెట్టుకుని నవ్వుకో నవసరం లేదు. తమ విశ్వాసాలలో విశ్వాసం ఉన్నవాళ్ళు తమ రనుకున్న దానికంటె చాలా అరుదు!)

నేను పతనమయింది రాధను పెళ్ళి చేసుకోవటంలో కానే కాదు.

నిన్న కాఫీ కలుపుతూ రాధ లతా మంగేష్కరు పాడిన పాటేదో పాడుకొం టూంటే, "రాధా, నువు పాడితే లతకన్న బాగుందేమిటి," అన్నాను.

మరుక్షణం నా శరీరం జలదరించింది. ఈ పతనం ఎక్కడ ఆగుతుందో నాకే తెలీదు.

ముద్రణ : ?
ప్రచురణ : పెళ్ళి చెయ్యకుండా చూడు కథల సంపుటిలో, ఎమెస్కో, మద్రాసు, 1968.